# మెనీ థేంక్స్ మనోరమా!

తటవర్తి రామచంద్రరావు

ఆవేళ కాలేజీకి స్ట్రయికు. స్టూడెంట్స్ కేవో డిమాండ్లు వున్నాయి. వాళ్ళు క్లాసులకి రాక పోయినా మాలెక్చరర్సుకి కాలేజీకి రాక తప్పదు!

స్టాఫ్‌రూములో అడుగు పెట్టేసరికి తెలుగు పండితులు గంగాధరశాస్త్రి గారు. కెమిస్ట్రీ లెక్చరరు శ్యామ్యూలు తప్ప మరెవ్వరూ కనిపించలేదు.... అంటే, అప్పటికే అంతా అటెండెన్స్ రిజిస్టరులో సంతకాలు పెట్టేసి ఉడాయించేసినట్టున్నారు!

గదంతా కలయజూసాను. అప్పుడు కనిపించింది జూయాలజీ డిమానస్ట్రేటర్ మనోరమ! కిటికీ పక్కగా కుర్చీ వేసుక్కూర్చుని ఏదో నవల కాబోలు చదువుకుంటోంది. నన్ను చూసి విష్ చేసి మళ్ళీ నవలలో పడిపోయింది ఆమె.

శామ్యూలు ఏదో చెపుతున్నాడు. వింటున్నట్టు ఊకొడుతున్నానే కాని నాకళ్ళు మాత్రం మనోరమ మీదనే ఉండిపోయాయి.

ఆ అధరాలు పద్మపత్రాల్లా ముద్దుగా ముడిపెంగా ముడుచుకున్నాయి. అక్షరాల వరవడి పెడుతూ, కదిలే ఆ నల్లటి కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి. ఆమె కూర్చున్న భంగిమ హరివిల్లులా మనోజ్ఞంగావుంది. మళ్ళీ మళ్ళీ కన్నుల దోనెలతో, గుండెల కెత్తుకోవాలనిపించే మోహనరూపం. ఒక్కసారి చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే శరీర సౌష్టవం. మనోరమ నిజంగా మనోహరి!

నేను అన్య మనస్కంగా వున్నానని గుర్తించాడు కాబోలు... కబుర్లు కట్టిపెట్టి తన లెక్చర్ నోట్సు వ్రాసుకోవటంలో మునిగి పోయాడు శామ్యూలు.

నేనూ నా మేథ్స్ నోట్సు తిరగవేయటం ప్రారంభించాను. కాని, దృష్టి దాని మీదలేదు. మనోరమతో ఏదోటి మాట్లాడాలని మహాయిదిగావుంది. పోనీ, నా వైపు చూస్తుందేమో ఏదోటి టాపిక్ ఎత్తుదామంటే ఆమె నవలలో మరీ లోతుగా మునిగి పోయింది. ఆమెని ఆకర్షించటం ఎలాగో తోచలేదు.

'చెలులతో మాట్లాడు సౌఖ్యమ్ము కొఱకు
చిత్రలేఖన విద్య నేర్చినాను!' అన్నాడు గాలిబ్.

చిన్నప్పుడు బొమ్మలు బాగానే వేసే వాణ్ని. కాని, అస్తమానం బొమ్మలు వేయటమేనా లెక్కలు చేయరా వెధవాయ్– అని మామయ్య తిట్టేవాడు. ఆ బొమ్మలు పోయాయి. ఇప్పుడు నేనూ నా లెక్కలూ మిగిలాము. బొమ్మలు గీసే అలవాటు ఎంత తప్పి పోయిందంటే ఇప్పుడు జామెట్రీ ఫిగర్సు కూడ తిన్నగా గీయలేను. ఇంక అమ్మాయిల ఒంపుల సొంపుల్ని రేఖల్లో దిద్దటం నావల్ల ఏమవుతుంది!

శామ్యూలు, శాస్త్రిగారు వెళ్ళిపోతే బాగుండు ననిపించింది. వాళ్ళకన్న ముందు ఆమె వెళ్ళిపోతుందేమో నని నాభయం! నోట్సు పేజీలు తిరగవేస్తున్నానే కాని మనోరమ సుందర తనూలతనే నాకంటి కొనలు పరికిస్తున్నాయి! ఆల్ఫా బీటా గామాలకి బదులు చేపపిల్లల్లాంటి కళ్ళు, కొన దేలిన నాజూకయిన ముక్కు, దొండపండులాంటి పెదవులు కళ్ళముందు మురిపిస్తున్నాయి. ఉండబట్టలేక ఒక్కసారి దీర్ఘంగా ఆమె వైపు చూసాను.

ఆమె చేతిలోని పుస్తకంలో మూడు వంతులు పేజీలయిపోయాయి. అంటే, కథ మంచి క్లయిమాక్స్‌కి చేరిందన్నమాట! అందుకే దాన్ని వదలిపెట్టలేక పోతోంది. లేకపోతే. అందరిలాగే ఎప్పుడో ఇంటికి వెళ్ళిపోయివుండేది.

ఆమె ఒక్కోపేజీ తిరగవేస్తున్న కొద్దీ నాలో ఆత్రుత ఒక్కో డిగ్రీ పెరిగి పోతోంది. ఆశ రెండేసి డిగ్రీలు చొప్పున తరిగిపోతోంది.

'అందాన్ని సృజించావు ఒక చేతో
ఆంక్షలు విధించావు ఒక చేతో
ఆశలు రేగుతున్న నాదారినుండి ఓ అల్లా!
అందాన్నో ఆంక్షనో తొలగించకపోతే ఎల్లా?'

ఆరుద్ర అరబ్బీ మురబ్బా ఒకటి గుర్తొచ్చింది..... తెగించి ఒకసారి కళ్ళారా ఆమె అందాన్ని త్రాగేసి తనివితీరా గుటక వేసాను. 'ఏదోటి డ్రమెటిక్‌గా జరిగితే ఎంత బావుండును!' అని కొంచెం మనస్సు కోరింది.

నా మనస్సులోని మాట విని అర్థం చేసుకున్న వాడిలా చేతో పుస్తకాలతో సహా చటుక్కున లేచి వెళ్ళిపోయాడు శామ్యూలు.

ఒకకంట శాస్త్రిగారిని మరోకంట మనోరమని చూస్తూ నా నోట్సు పేజీలు మాత్రం యాంత్రికంగా అటూయిటూ తిప్పుతున్నాను.

'అందము + ఆకర్షణ = మనోరమ' అన్న కొత్త ఈక్వేషన్ ఒకటి బుర్రలో మెదిలింది. ఉన్నపళంగా బుద్ధి మరీ బరితెగించి పోయింది. కళ్ళప్పగించి ఆమె సోయగాన్ని కళ్ళతో త్రాగేస్తూ ఉండి పోయాను!

ఎక్కడి శ్రుతి యెక్కడి స్మృతి
యెక్కడి జపమేటి నేమమెక్కడి ధ్యానం
బెక్కడి జ్ఞానము చక్కని
దోక్క చకోరాక్షి యెదుట నుదటియున్నన్!

అనంత నార్యుడు నాలాంటి వాడి నెవడ్నో చూసాకనే ఆ పద్యం రాసుంటాడు.

'నేనొస్తానండీ రావుగారూ!' అని హఠాత్తుగా శాస్త్రిగారు లేచి నిలబడే సరికి ఉలిక్కిపడి గుమ్మం వైపు చూసాను. శాస్త్రిగారి అబ్బాయి అక్కడ నిలబడి వున్నాడు. అంటే. ఇంటి నుంచి పిలుపు వచ్చిందన్నమాట!

'థేంక్యూ చిట్టి శాస్త్రీ' అని అకుర్రాడికి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పేసి..... నిజంగా మేథ్స్ నోట్సు చూసేస్తున్న వాడిలా కాసేపు 'పోజు' పెట్టాను. మనోరమ ఓసారి తలయెత్తి నా వైపు చూసిందని క్రీగంట నేను గమనించక పోలేదు. ఆగదిలో మేమిద్దరం తప్ప మరో ప్రాణిలేదు. క్షణాలు హడావిడిగా పరిగెత్తి పోతున్నాయి. ఆమె త్రిప్పే పేజీల చప్పుడు నాగుండెల చప్పుడ్ని మరింత పెంచుతోంది.....

'హమ్ తుమ్ ఏక్ కమరేమె బంద్‌హో.... చాబీ ఖో జాయ్....' అని ఎక్కడినుంచో మైక్‌లో పాట వినిపించింది.

చటుక్కున మనోరమవైపు చూసాను. ఆమె కూడ అప్పుడే నావైపు చూసింది. ఆమె చూపులు చెదిరాయి. కంగారుగానవ్వి "ఆపాట బాబీలోది కదూ!" అన్నాను.

"అవునండి". అంది బిత్తరగా చూస్తూ.

ఇంక ఫర్వాలేదు. ఓ కొస దొరికింది. ఇంక సంభాషణ పెంచచ్చు. "ప్చ్! ఆసినిమా నాకు నచ్చలేదు". అన్నాను.

ఆమె చిత్రంగా చూసింది. "అదేమిటండీ! ఆ సినిమా బాగానే ఆడింది కదండీ!"

"మంచి సినిమా అంటే బాగా ఆడటం ఒక్కటే కాదుకదా! ఆవారా, జాగ్తే రహో ... లాంటి క్లాస్ ఫిలుమ్సు తీసిన రాజకపూరేనా ఇంత చెత్త సినిమా తీసింది అని నాకనిపించింది. అలంకార్‌లో 'సంగమ్' ఆడుతోంది. మరి రాజకపూర్ తీసిందే! పదిహేనేళ్ళయినా ఇంకా జనం విరగబడి చూస్తున్నారు.



అదిగో, అలావుండాలి సినిమా అంటే – ఎన్ని జనరేషన్స్ మారినా కళాఖండాల్లా ఉండి పోవాలి....' అని ఓ పెద్ద లెక్చర్ ఇచ్చాను.

"నేను చూళ్ళేదండీ! రాజకపూర్ సినిమాలంటే మానాన్నగారిక్కూడా చాలా యిష్టం".

ఎక్కడలేని ధైర్యం వచ్చింది. "అయితే, నువ్వు ఇప్పుడు ఎందుకు చూడకూడదు? కావాలంటే నేనూవస్తాను కంపెనీగా!" అన్నాను.

ఆమె బిత్తరపోతూ చూసింది.

ఆ అవకాశం జారవిడుచుకోవాలని లేదునాకు. "ఈ పూట కాలేజీ ఎలాగా లేదు. ఇక్కడ వూరికే కూర్చునే దానికి బదులు అలా సరదాగా వెళ్ళొద్దాంపద... అబ్బే, నీకభ్యంతరం లేకపోతేనే! "సాధ్యమయినంత గోముగా అన్నాను.

"అహ! అందుక్కాదండి." అని బెదురుతూ ఆగిపోయింది.

"మరి?"

"ఎవరయినా చూస్తే...."

ఎగిరి గెంతినంత పని చేసాను. ఎవరయినా చూస్తారేమోనని భయంతప్ప నాతో రావటం ఆమె కభ్యంతరంలేదు. "ఇందులో తప్పేముంది మనోరమా! నువ్వేమీ కానిపని చేయటం లేదే! ఒకే కాలేజీలో పని చేసేవాళ్ళిద్దరికి ఒకేపూట ఒకేహాల్లో సినిమా చూడాలనిపించటం తప్పా! కంపెనీకోసం ఓ చోట కూర్చుని చూసినంత మాత్రాన ఇందులో అపరాధ మేముంది? చదువుకున్న దానివి. ఇంకా సందేహాలేనా?..." ఇలా ఉమన్స్ లిబ్‌మీద ఓ పది నిమిషాలు ఏకధాటిగా లెక్చర్‌యిచ్చి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసేసాను....

అరగంట తర్వాత అలంకార్‌లో ఆ అందాలభామ సరసన కూర్చుని 'సంగమ్' సినిమా చూస్తూ మధురోహలలో తేలిపోయాను. ఆమె నుంచి కమ్మని పరిమళాలేవో పాకి వస్తున్నాయి. పక్కనే కూర్చున్న పరువం అంతుపట్టని వెచ్చ తనాన్ని, నా నరనరాల్లోనూ పరిగెత్తిస్తోంది. ఏదో పరవశం.... మరేదో పులకరింపు. ఇంకేదో హాయి! మత్తుగా గమ్మత్తుగా వుంది!...

'మేరే మన్‌కీ గంగా
ఔర్ తేరే మన్‌కీ జమునాకా
బోల్ రాధా బోల్
సంగమ్ హోగాకీ నహీ!'

ముఖేష్‌పాట ఎంత చక్కిలిగిలి పెట్టిందంటే ఉత్సాహంతో ఊగిసలాడి పోయింది నేనేకాదు. మనోరమకూడ పరవశంతో పొంగి పొరలిత్తి పోయింది. అంతవరకు ఒళ్ళో చేతులు పెట్టుకొని ఒబ్బిడిగా కూర్చున్నది కుర్చీ చేతిమీదవున్న నాచేతిమీద తన చేయివేసింది!

అప్రయత్నంగా నా చేతిని వెనక్కి లాక్కున్నాను.

Rao

ఆ హఠాత్పరిణామానికి నావైపోసారి చూసి ఆమె కూడ తన చేతిని గబుక్కున వెనక్కి తీసుకొని వొళ్ళో పెట్టుకుంది. తను చేసిన పనికి సిగ్గు పడినట్టుంది– తల తిప్పుకొని ముడుచుకు పోయింది.

'ఆమె ముద్దిచ్చుటకు వెనుకాడదేమొ
కాని ఇమ్మని అడుగ వెన్కాడినాను!'

అన్నాడు గాలిబ్. పూలగుత్తి వొచ్చి మీదపడితే చేతో తోసేసాను. ఎంతమూర్ఖుడ్ని! మర్యాదస్తుడిగా మనోరమ మనస్సులో నా గౌరవం పెరిగి వుండచ్చు! కాని, మళ్ళీ అలాంటి అదృష్టం దొరుకుతుందా?

'మై క్యాకరూఁ రామ్
ముఝే బుడ్ఢా మిల్గయా!'

వైజయంతిమాల తన పాటతో రాజకపూర్‌ని ఆట పట్టిస్తోంది సినిమాలో. అప్రయత్నంగా మనోరమవైపు చూసాను. ఆ మసక చీకటిలో కూడ ఆమె అధరాల మీద చిరునవ్వు తళుక్కు మనటం నాక్కనిపించింది. కొంపదీసి మనోరమ నా గురించి అలాగే అనుకోవటం లేదుకదా!.... ఒక్క సారిగా ఏదో ఉద్రేకం ఒళ్ళంతా పట్టి వూపింది. గబుక్కున ఆమె ముఖాన్ని నా చేతుల్లోకి తీసుకొని ముద్దులతో ముంచెత్తేద్దామనిపించింది. అతికష్టం మీద నిగ్రహించుకున్నాను. చేతులకి సంకెళ్ళు వేసుకున్నాను. లేకపోతే, మరుక్షణంలో ఏ పిచ్చిపని చేసేవాడినో ఏమో!

ఇంటర్వెల్‌లో "బయటకు వెడదామా! కూల్డ్రింక్ తాగుదాం". అన్నాను.

"అబ్బే, వద్దండీ!" అంది ఆమె మొహమాటంగా.

"హాల్లో వేడిగావుంది. బయటకు వెడితే కొంచెం చల్లగాలి పీల్చుకున్నట్టు వుంటుంది." అని నవ్వాను.

ఆమె మృదువుగా నవ్వి "అయితే, ఒకషరతు..... కూల్డ్రింకయినా నన్ను డబ్బు లివ్వనివ్వండి" అంది.

"అందమయిన అమ్మాయిలు ఇలాంటి షరతులు పెట్టటం నేనెక్కడా వినలేదు. కనలేదు" అన్నాను కొంటెగా.

హాల్లో అట్టే వెలుగులేకపోయినా ఆమె బుగ్గలు ఎర్రబెక్కటం గుర్తించాను. "త్వరగా వెళ్ళి వచ్చేద్దాం. రండి." అని దారి తీసాను.

తన చేతిలోని పుస్తకాన్ని గుండెలకొత్తి పట్టుకుంటూ ముద్దరాలిలా బయటకు నడిచి వచ్చింది మనోరమ. 'ఆమె చేతిలోని పుస్తకాన్నయినా కాకపోయానే?' అని అనుకున్నాను.

స్ట్రాలోంచి కూల్డ్రింకు తాగుతుంటే.... అసలే చిన్నది.... మరీ మల్లె మొగ్గంత అయిపోయింది ఆమెనోరు. 'ఆమె పెదాలు రుచి చూపిన స్ట్రా ఎంత పుణ్యం చేసుకుపుట్టింది.' అనుకున్నాను. కూల్డ్రింకు సీసాలోంచి పొంగి పొరలే నురుగులాగునే అంతరాంతరాలలో మధురోహలలో పొంగి పొరలిపోయాను.



నాట్య గణపతి
(చిత్రం : పి. వి. నాయుడు)

## తొలి పూజల దొర

తొండమున్నవాడ, తొలి పూజ గొనువాడ
ఎలుక వాహనంబు నెక్కువాడ
కుడుము లుండ్రము లనకడు ప్రీతిగలవాడ
విఘ్న రాజ భువికి వేగరమ్ము

పాఠశాలకేగు బాల బాలికలము
పుస్తకాలు నీదు మ్రోల నుంచి
పూలు పత్రులతోడ పూజ చేయగ, వేచి
యుంటిమయ్య నీలకంఠ తనయ

కొబ్బరరటిపండ్లు కుడుములు నుండ్రాళ్ళు
పాలు పంచదార పాయసమును
ఇష్టమనియె తెచ్చి యుంచాము నీకయ్య
ఆరగించ గణపతయ్య రార.

మంచి మనసు నిచ్చి మంచి మాలో పెంచి
మంచి రీతి మసల మాకు నేర్పి
ఎల్లవేళ మమ్ము చల్లగా గాచుచు
చూచుచుండుమయ్య శూర్ప కర్ణ.

–రాయప్రోలు వామనమూర్తి

## మెనీ థేంక్స్ మనోరమా!

నాదృష్టంతా ఆమె బుగ్గల మీద చెమరే గులాబిరంగు మీదనేవుంది. ఆమెతో గడిపే ఆ తియ్యని క్షణాలు నాకెంతో థ్రిల్లింగ్‌గా ఉన్నాయి. కళ్ళముందున్న మనోరమ తప్ప..... పరిసరాలలో వున్నదంతా మిథ్య.... అని నా మనస్సు కనిపించింది.

ఎంత చక్కని అనుభవం!

ఎన్నాళ్ళకెన్నాళ్ళకు!

ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితం – పెళ్ళి కాకముందు – శాంతితో సినిమాకు వెళ్ళినప్పుడు కలిగిన మధురానుభూతులు మళ్ళీ ఇప్పుడు – పునరావృతమయ్యాయి! చూస్తుండగానే ఆమధురక్షణాలు పరిగెత్తిపోయాయి.....

సినిమా అయిపోయింది.

మనోరమ వెళ్ళిపోయింది.

ఏదో అమూల్యమయినది చేజారవిడుచుకున్న వాడిలా నిరుత్సాహంగా ఇల్లు చేరాను.

తలుపుతీసిన శాంతి "ఏమిటండీ అలావున్నారు!" అని అడిగింది.

"ఏంలేదు. కొంచెం తలనెప్పిగావుంది." అన్నాను ముఖం తిప్పుకుంటూ. నిజంగానే తలనెప్పుని పెంచింది. బట్టలు మార్చుకొని కాళ్ళు చేతులు ముఖం కడుక్కొని పడగ్గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయాను.

"కాఫీ తాగండి" అంటూ కప్పుతో వచ్చింది శాంతి.

నేనీవేళ ఆమెకు తెలియకుండా ఓ పని చేసాను. ఏ భార్యా సహించలేని పని చేసాను. అందుకే ఆమె ముఖంలోకి చూడలేక పోయాను. తలదించుకొని కాఫీ తాగేసాను.

"పోనీ, ఏ మాత్రయినా వేసుకుంటారా!"

ఆమె నాగురించి ఎంత ఆరాటన పడుతోంది! గిల్టీగా ఫీలయ్యాను. "వద్దు".

"అమృతాంజనం రాస్తా పోనీ!"

మామూలప్పుడయితే శాంతి చల్లని చేయి నానుదుటను తాకితే కలిగే హాయికోసం సరేనని వుండేవాడిని. కాని ఆక్షణంలో ఆమె కళ్ళల్లోకి చూసేధైర్యం లేక పోయింది. "కాసేపు పడుకుంటా. అదే తగ్గిపోతుంది" అన్నాను. నేనటు తిరిగి పడుకోవటం చూసి కాబోలు... మౌనంగా గది తలుపులు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది శాంతి.

గట్టిగా కళ్ళు మూసుకొని పడుకున్నాను కాని ఎంతో సేపటి దాకా నిద్రపట్టలేదు. మనోరమతో గడిపిన మధుర క్షణాలు ఇచ్చిన మత్తులాంటి దేదో ఒళ్ళంతా పాకుతోంది. మరోవైపు శాంతి మనస్సు

'ఉత్తరాలు' శీర్షికకి రాసేవారు
తమపేరు, పూర్తి చిరునామా
తెలుగు లిపిలో రాయాలని
మనవి చేస్తున్నాము.
–సంపాదకుడు.

కిష్టం లేనిది ఎందుకు చేసానా అని అసంతృప్తిగానూ వుంది. చిత్రమయిన పరిస్థితి!

నాకు తెలియకుండానే ఎప్పుడో నిద్రలోకి జారిపోయాను....

బయట గదిలో పిల్లల మాటల అలికిడికి మెలకువ వచ్చింది. కిటికీలోంచి బయిటికి చూసాను. అప్పుడే బయిట చీకట్లావరించుకుంటున్నాయి. అంటే, రెండు మూడు గంటలసేపు పడుకున్నానన్నమాట!

గది తలుపులు తోసుకుని కరుణ లోపలికి వచ్చింది. "లేచేసావానాన్నా! మామయ్య వచ్చాడు" అంది.

ఇంకనాకు పైకి లేవక త ... గది బయటకు వచ్చి ప్రభాకర్‌ని పలకరించాను. "ఎప్పుడొచ్చావ్?" అంటూ.

"మామయ్య పొద్దున్నే వచ్చాడు నాన్నా! నన్నూ చెల్లాయినీ మేట్నీకి తీసుకు వెళ్ళాడు" అన్నాడు బాబు.

"ఏం సినిమా?" అప్రయత్నంగా అడిగాను.

"సంగమ్!" అంది కరుణ కళ్ళు తిప్పుకుంటూ.

నా తలమీద పిడుగు పడినట్టయింది. చటుక్కున ప్రభాకర్ ముఖంలోకి తేరిపార చూసాను. అతను తల తిప్పుకున్నాడు. అంటే?.... నేను మనోరమతో కలిసి సినిమాకు వెళ్ళటం చూసాడా అతను!

కంగారుగా శాంతివైపు చూసాను. ఆమె ముఖం

## సాక్షి గణపతి

### సాక్షి రంగారావు

మా ఇంటి పేరు 'సాక్షి' కాదు. 'సాక్షి' చిత్రం మూలంగా ఆ పేరు వచ్చిందన్న విషయం చాలా మందికి తెలుసనుకుంటాను.

అసలు 'సాక్షి' అనే ఇంటి పేరు ఎవరికైనా ఉన్నట్లు నాకు తెలీదు.

కాని, శ్రీశైలం ముందున్న వినాయకుడికి మాత్రం 'సాక్షి గణపతి' అని పేరు. భక్తులు ముందుగా ఈయన్ని దర్శించి, ఈయన వద్దున్న పుస్తకంలో తమ పేర్లు రాస్తే, ముక్తి కలుగుతుందట. ఫలానావారు శ్రీశైలాన్ని దర్శించి పుణ్యం మూట కట్టుకున్నట్లు ఈయన వచ్చి సాక్ష్యం చెబుతారట!

అంటే, ఈ లోకంలో కాకుండా పరలోకంలో కూడా 'సాక్షి' అవసరం ఉందన్న మాట! (జి. ఎ. జి.)

## మెనీ థేంక్స్ మనోరమా!

ఎర్రగావుంది. అంటే? ప్రభాకర్ తను చూసింది వాళ్ళక్కయ్యకి చెప్పేసాడా?... ఏదో గగుర్పాటుతో నాగుండె జల్లుమంది.

నన్ను రక్షిస్తూ.... అక్కడ్నుంచి తనే వంటింట్లోకి వెళ్ళి పోయింది శాంతి. పిల్లలు ఎటువంటి ఇబ్బంది కలిగించే ప్రశ్నలూ వేయకుండా ముఖం కడుక్కునే వంకన బాత్రూముకి పారిపోయాను.

ఆ తర్వాత భోజనాల దగ్గర కూర్చున్న పదిహేను నిమిషాలు నాకు పదిహేను యుగాలుగా గడిచాయి. శాంతి మౌనం భరించలేనంత బాధగా వున్నా.... పిల్లలతో ఏదో చిలిపి కబుర్లు చెపుతూనన్ను రక్షించి పుణ్యం కట్టుకున్నాడు ప్రభాకర్.

రాత్రి డాబా మీద పడుకోటానికి పిల్లల్ని తీసుకు వెళ్ళాడు అతను.

శాంతి చాపతెచ్చుకొని క్రిందవేసుకొని పడుకుంది. అంటే, ఇంక అనుమానం లేదు. ఆమెకు నిజం తెల్సిపోయింది!

ఎంతోసేపు మంచంమీద అలా కూర్చోలేక పోయాను. "శాంతీ!"

ఆమె పలకలేదు. మళ్ళీ పిలిచాను. ఊకొట్టింది. కాని, నావైపు తిరగలేదు. ఇంకనాకు తప్పలేదు. క్రిందకు దిగివెళ్ళాను.

చాప మీద ఆమె పక్కనే కూర్చున్నాను. ఆమె కదల్లేదు. ముఖంమీద చేయి అడ్డంగా పెట్టుకొని అలాగే పడుకుంది.

"చేసిన తప్పుని ఒప్పుకొనే అవకాశం యివ్వవా?"

శాంతి తన ముఖం మీద చేయితీసి నావైపు చూసింది. ఆమెకళ్ళు తడితడిగావున్నాయి. తనలో పడుతున్న వేదనని ఆమె అదిరేముక్కు చెపుతోంది.

"....క్షణికమయిన బలహీనతకి లొంగి


కళాత్మకమైన ఫర్నిచర్‌లో అపూర్వ షోరూం Amulya

విజయవాడలో అతిపెద్ద
నూతన ఫర్నిచర్ షోరూమ్!






QUALITY, ECONOMY, DURABILITY

Amulya STEEL WOOD FURNITURES
Ph: 74810
62936
ALI BEIG St., OPP: ANNAPURNA THEATRE, VIJAYAWADA-2

# ‘అర్క’ పూల సేవ!

స్వామీ లంబోదరా
నీ వాహనం పెద్ద తిండి దొంగ
నీకేమి పెట్టగలం?
ఈసారి విభవలో
పిట్ట తిండి కూడా గిట్టదు.

వినాయకా, శివ బాలకా
ఏడాదికోసారి వస్తావు
సారీ చెప్తే పోతావు
కానీ కొందరు
ఏటిపొడుగునా ఉన్నారు

ఏళ్ళ తరబడిగా
దోచుకు తింటున్నారు
నాయకుల మంటున్నారు
సారీ చెప్పినా పోరు

మితిమీరుతున్నారు
అవినీతిని పెంచుతున్నారు
అధ్వమైన గడ్డి తింటున్నారు.

అందుకని ఎండు గడ్డి, పచ్చి గడ్డి
దొరకడం లేదు. ఉండ్రాళ్ళు
సరిగా ఉడకటం లేదు.

* * * * * *


అధిక వర్షాలవల్ల
ఆషాఢంలో చెరువులు
[illegible]
[illegible]

ఎంట్రీ వన్నూ, ఎక్సిట్ వన్నూ
[illegible]కు బస్తీకి చేరాయి
ధరలు పుంజుకున్నాయి
సంఖ్య తగ్గించి సమర్పించాము
సరిపుచ్చుకోవయ్య గణనాథ
మమ్ము[illegible]వయ్య
ఓబజ్జ గణపయ్యా నీ బంటు మేమయ్యా

* * * * * * *

విభవలో అర్క (జిల్లేడు) పూలశోభం
నీ కెంతో వైభవం

-ఎం. ఎస్. ఎం.



గణాధిపతి
(ఫొటో : కె. మధు)

పోయాను....” అంటూ ఆ వేళ ఏం జరిగిందో అంతా చెప్పాను”.... నీకు తెలియకుండా చాటుగా నా ఆనందాన్ని వెతుక్కోవాలని నేనెప్పుడూ అనుకోలేదు శాంతీ! అప్పటి కప్పుడు అనాలోచితంగా చేసిన పని.... ఇప్పుడు నిన్నిలా చూస్తానని ఊహించి వుంటే నేనాపని చేసుండేవాణ్ని కాదు. నువ్వు నమ్మినా నమ్మక పోయినా ఇదినిజం! నన్ను క్షమించమని అడగటంలేదు. నా తప్పు నొప్పుకుంటున్నాను”.

నిజంగానే తప్పునొప్పు కోవటంలో ఒక సుఖం ఉంది. మనసులోని మాట పైకి చెప్పుకొనే సరికి గుండె తేలిక పడింది. శాంతివైపు అప్పుడు ధైర్యంగా చూడగలిగాను.

శాంతి ముఖం ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా వుంది. అంటే, నన్ను క్షమించిందన్నమాట! ఆమె పైకి లేచింది. చీరచెంగుతో కళ్ళొత్తుకుని నా దగ్గరగా జరిగింది. "మీరిదంతా చెపుతుంటే పదిహేనేళ్ళ నాటి సంగతి గుర్తొస్తోంది" అని చిన్నగా నవ్వింది.

"ఏమిటి?"

"మన పెళ్ళి కాకముందు .... మీరు రమ్మంటే మీతో పాటు సినిమాకి వచ్చిన రోజు గుర్తొస్తోంది."

"నాకూ గుర్తొచ్చింది."

"కానీ, అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడావుందో చూసారా!"

"ఏమిటి?"

"అప్పుడు మీ వెంట వచ్చింది ఎవరు? ఇవేళ వచ్చిందెవరు? ఇద్దరూ పెళ్ళి కాని ఆడపిల్లలే! కాని, అప్పుడు మీకు పెళ్ళికాలేదు. ఇప్పుడు అయింది. మీరూ ఆ అమ్మాయీ సినిమా చూసి బయిటకు వస్తుంటే ప్రభాకర్ ఒక్కడే చూసాడు. పిల్లలు చూసుంటే ఎంత అనర్థం జరిగేది? పిల్లల దృష్టిలో మీ విలువ తగ్గిపోతే నాక్కాదా ఆబాధ! పెళ్ళి కావల్సిన పిల్ల..... ఆ పిల్ల చేసిన పనికి మరెవరయినా పెడర్థాలు తీసి ఇంకెవరికయినా చేరవేస్తే?....'

ఉమెన్ ఆర్ వైజర్ దేన్ మెన్ బికాజ్ దే నో లెస్ అండ్ అండర్‌స్టాండ్ మోర్!

అన్నాడు జేమ్సు స్టెఫెన్స్. ఆయన మాటల్లో ఎంత నిజముంది? ఆడది తన కోసమేకాదు. ఇంకొకరి కోసం కూడా జీవిస్తుంది. మగవాడి కన్న ఎక్కువ బాధ్యతని తలకెత్తుకుంటుంది.

"....నేనింత దూరం ఆలోచించ లేదు శాంతీ! చాలా పొరపాటయింది. ఆ అమ్మాయికి చెడ్డపేరొస్తే నన్ను నేనెప్పటికీ క్షమించుకోలేను."

నా చేతిమీద తన చేయివేసి ప్రేమగా నిమిరింది శాంతి. "మిమ్మల్ని మీరు చిన్న బుచ్చుకుంటూ మాట్లాడితే నాకు తృప్తిగా వుంటుందనుకుంటున్నారా? మనం తొందరపడి చేసే పనులు ఒక్కోసారి ఎంతటి ప్రమాదాన్నయినా తెచ్చి పెడతాయని చెపుతున్నానేకాని ఇవేళ జరిగిందానికి బాధ్యతంతా మీదే కాదు. మీరు రమ్మనగానే ఆ అమ్మాయిమాత్రం మీవెంట ఎందుకు రావాలి! తన జాగ్రత్తలో తనువుండద్దూ?" "లేదు శాంతీ! ఆ బాధ్యతంతా నాదే! ఆ అమ్మాయి చాలా మంచిది. నా మీద మర్యాదఉంచి నా మాట కాదనలేకనే వచ్చింది".

"బలేవారే! పదిహేనేళ్ళ క్రితం మీరు రమ్మనగానే నేనూ వచ్చాను. మీ మాట కాదనలేకనే కదూ నేనూ వచ్చింది! అప్పుడు మీరు అమర్యాదగా ప్రవర్తించారని నేనన్నానా?" అని శాంతి కొంటెగా నవ్వింది.

ఆమె చిలిపి తనానికి నా గుండెల మీదనుంచి పెద్ద బరువు తీసేసినట్టయింది.

"ఈమాటు ఆమెకనిపిస్తే 'మెనీ థేంక్స్ మనోరమా!' అని చెపుతా!" అంది శాంతి నామెడ చుట్టూ చేతులు వేస్తూ.

"ఎందుకూ?"

"ఈ రసిక చక్రవర్తి మనస్సుకి పదిహేనేళ్ళు వయస్సు తగ్గించినందుకు!" శాంతిది ఎంతటి ఔన్నత్యం గల మనస్సు!

నిజంగానే చిన్నవాడి నయిపోయి ఆమె ఒడిలో కరిగి పోయాను.

'ఓ! ఉమన్! లౌలీ ఉమన్!
నేచర్ మేడ్ దీ టు టెంపర్ మాన్.
ఉయ్ హేడ్ బీట్స్ విత్‌అవుట్ యూ!'

–'ఓట్వే' అన్న మాటలు అప్పుడు నాకు గుర్తుకు వచ్చాయి! □